
అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాలలో పోతరాజుల విన్యాసాలు


రామాయంపేట(మెదక్): బోనాలతో విద్యార్థినులు


చిన్నశంకరంపేట మండలం చందాపూర్ పాఠశాలలో..

పాఠశాలల్లో బోనాల సందడి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రతి విద్యార్థికి అవగాహన అవసరమని మండలంలోని అచ్చంపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. శనివారం పాఠశాలలో విద్యార్థులు ముందస్తు బోనాల సంబరాలు నిర్వహించారు. విద్యార్థినులు బోనాలు తయారుచేసి ఎత్తుకోగా, విద్యార్థులు పోతరాజుల వేషధారణతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, గజపతి, సుధాకర్ జయమ్మ, విద్యార్థిని విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అలాగే కొల్చారం మండలంలోని రంగంపేట ఉన్నత పాఠశాలలో ముందస్తు బోనాల పండగను ఘనంగా నిర్వహించారు.

–నర్సాపూర్ రూరల్/కొల్చారం:


పోతరాజు వేషధారణలో విద్యార్థి

క్లుప్తంగా

శ్రీవైష్ణవులను మైనార్టీలుగా గుర్తించాలి


సభ్యత్వాలు నమోదు చేస్తున్న కృష్ణ

చేగుంట(తూప్రాన్): రాష్ట్ర ప్రభుత్వం శ్రీవైష్ణవులను మైనార్టీలుగా గుర్తించాలని శ్రీవైష్ణవ సేవా సంఘం జేఏసీ చైర్మన్ కృష్ణ కోరారు. చేగుంటలో శనివారం ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణనతో రాష్ట్రంలో శ్రీవైష్ణవ, బ్రాహ్మణ, కరణం, లింగాయత్, శైవ, చాత్తాద శ్రీవైష్ణవ కులాలు మైనార్టీలో పడిపోయాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, నాచారం దేవస్థానం పాలకమండలి సభ్యులు జగన్నాథచార్యులు, సంఘం సభ్యులు వసుదేవాచారి, ప్రసాదాచార్యులు, శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన


కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ రమాదేవి

హవేళిఘణాపూర్(మెదక్): మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంను మెదక్ ఆర్డీఓ రమాదేవి శనివారం సందర్శించారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించిన భూభారతి వెబ్‌సైట్‌లో ఉన్న వాటిపై రెవెన్యూ సిబ్బందికి అవగాహన కల్పించారు. భూభారతిలో వచ్చిన దరఖాస్తులపై ఎలా వ్యవహరించాలి.. అనే దానిపై పూర్తిగా వివరించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ సింధూరేణుక, గిర్దావర్ ఆబేద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సమాజ హితం కోసమే పోలీస్ వ్యవస్థ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

పాపన్నపేట(మెదక్): పోలీస్ వ్యవస్థ సమాజ హితం కోసమే పనిచేస్తుందని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం నోబ్యాగ్ డే ను పురస్కరించుకొని పాపన్నపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఐ స్టేషన్‌లో అన్ని విభాగాలకు సంబంధించి వివరాలు, పోలీసుల విధుల గురించి వారికి వివరించారు. రోడ్డు ప్రమాదాలు బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమ్మవారికి కలశాల ఊరేగింపు


చేగుంటలో కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న మహిళలు

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రమైన చేగుంట మహంఖాళీ అమ్మవిరి బోనాల ఉత్సవాల సందర్భంగా శనివారం పూజల్లో భాగంగా కలుశాల ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 108 కలుషాలతో హనుమాన్ దేవాలయం నుండి ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారీ రాఘవపంతులు ఉత్సవ కమిటీ సభ్యులు మహిళ భక్తులు పాల్గొన్నారు.

అన్నివర్గాల అభివృద్ధికి కృషి


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

మెదక్‌జోన్: కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల అభివృద్ధికి కృషిచేస్తుందని ఎమ్మెల్యే రోహిత్ రావు అన్నారు. మెదక్ కురుమ సంఘం భవన నిర్మాణానికి రూ. 50 లక్షలు మంజూరు కాగా శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, కుర్మసంఘం ట్రస్టుబోర్డు చైర్మన్ ఎల్లయ్య, కాంగ్రెస్ నేతలు అశోక్‌తో పాటు వివిధ మండలాలకు చెందిన కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అన్నారు. శనివారం మండలానికి చెందిన పలువురికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్, సీనియర్ నాయకులు సురేష్‌గౌడ్, రమేష్, దత్తు, సుభాష్, యాదుల్, శంకర్‌గౌడ్, నర్సింలు, రవీందర్,


సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

విఠల్‌గౌడ్, కుమ్మరి శంకరయ్య, అంజయ్య, రమేష్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రం అందజేత


టేక్మాల్‌లో ఇందిరమ్మ ఇళ్లు పత్రాన్ని అందిస్తున్న నిమ్మరమేష్

టేక్మాల్(మెదక్): నాలుగేళ్ల క్రితం బారీ వర్షాలకు ఇల్లు కూలిపోవడంతో స్కూల్లో ఉంటున్న బత్తిని కిషన్ కుటుంబానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ అండగా నిలిచారని మండల పార్టీ అధ్యక్షుడు నిమ్మ రమేష్ అన్నారు. శనివారం టేక్మాల్‌లో ఇందిరమ్మ కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు పత్రాన్ని కిషన్ భార్యకు అందజేశారు. ఈ సందర్భంగా నిమ్మ రమేష్ మాట్లాడుతూ.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫౌండేషన్ చైర్మన్ త్రిష మూడు నెలల క్రితం బత్తిని కిషన్ కుటుంబాన్ని సందర్శించి ఆర్థిక సహాయం అందజేస్తూ ఇల్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. మంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని కలెక్టర్‌తో మాట్లాడి ఇల్లు మంజూరీ చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు కుమ్మరి బాలమణి, ధనుంజయ, శివాగౌడ్, నాయకులు సాగర్, అంబేష్, సాయి, శేషు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలకు కృషి

పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఉపాధ్యాయుల సమస్యల కోసం కృషి చేస్తూ రాష్ట్రంలోనే అగ్రశ్రేణి సంఘంగా పీఆర్టీయూ గుర్తింపు పొందిందని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ అన్నారు. శనివారం ఆయన చిలప్‌చెడ్ మండల పాఠశాల ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వీస్‌రూల్స్, హెల్త్‌కార్డ్స్, పీఆర్సీ, పెండింగ్ బిల్లుల సాధనకు తమ యూనియన్ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సునీల్, ప్రధాన కార్యదర్శి బుచ్చిరాములు, నాయకులు శ్రీనివాస్, సర్వన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సభ్యత్వాలు నమోదు చేసిన నాయకులు

మొక్కలను సంరక్షించడం మన బాధ్యత


ఈత మొక్కలు నాటుతున్న అధికారులు, గౌడసంఘం సభ్యులు

ఎక్సైజ్ ఎస్ఐ మహ్మద్ అజీజ్

మనోహరాబాద్(తూప్రాన్): మొక్కలు నాటడమే కాదు, వాటి సంరక్షణ బాధ్యత మనందరిపైనా ఉందని నర్సాపూర్ ఎక్సైజ్ ఎస్ఐ మహ్మద్ అజీజ్ పిలుపునిచ్చారు. మండలంలోని పర్కిబండ గ్రామంలో ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన వనమహోత్సవంలో ఈత మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సంఘం సభ్యులు విధిగా ఈత మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించి ఉపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, నాయకులు నారాయణగౌడ్, సంఘం సభ్యులు మధు, భిక్షపతి రాములు, అంజగౌడ్, ముత్యాలు, వెంకటేశ్, నవీన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22 వరకు పంపిణీ పూర్తి చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డు పత్రాలను ఈనెల 22 వరకు పంపిణీ పూర్తి చేయాలని తహసీల్దార్ కమలాద్రి ఆదేశించారు. శనివారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించి మండలంలోని లబ్ధిదారులకు మంజూరైన రేషన్ కార్డు పత్రాలను అందజేశారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ గ్రామాల్లో చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. మండలానికి 428 కొత్త రేషన్ కార్డులతో పాటు 1667 కార్డుల్లో వారి కుటుంబ సభ్యుల పేర్లు నమోదు అయినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ షఫీయోద్దీన్, ఎంపీఓ తిరుపతిరెడ్డి, మండల కార్యదర్శులు పాల్గొన్నారు.


కార్యదర్శులతో సమీక్ష సమావేశం

పారదర్శకంగా ఉపాధి పనులు


సామాజిక తనిఖీలో పాల్గొన్న ఏపీడీ రంగాచారి

ఏపీడీ రంగాచారి

పెద్దశంకరంపేట(మెదక్): ఉపాధిహామీ పనులను పారదర్శకంగా చేపట్టాలని ఏపీడీ రంగాచారి పేర్కొన్నారు. పెద్దశంకరంపేటలో శనివారం 15వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ...ఆయా గ్రామపంచాయితీల పరిధిలో 2024-25కి గాను రూ.5.53 కోట్లతో ఉపాధిపనులు చేపట్టామన్నారు. దీంతోపాటు పీఆర్ పరిధిలో రూ.37.50లక్షలు, ఫారెస్ట్ నర్సరీలో రూ.21 లక్షలతో చెట్ల పెంపకం చేపట్టారని తెలిపారు. ఆయా గ్రామాల పరిధిలో జరిగిన పనుల అవకతవకలపై రూ.1.23లక్షల నిధుల రికవరీకి ఆదేశించామని, సిబ్బందికి రూ.33 వేల జరిమానా విధించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి శ్రీహరి, హెచ్ఆర్.రాజు, అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి అంజాగౌడ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ షాకీర్‌అలీ, ఏపీఓ సంతోశ్‌కుమార్, ఈసీ నవాజుద్దీన్, టీఏలు, ఎఫ్ఏలు, గ్రామకార్యదర్శులు పాల్గొన్నారు.

శివ్వంపేట ఎంపీడీఓగా వెంకట లక్ష్మమ్మ



శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ఎంపీడీఓగా వెంకటలక్ష్మమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ విధు లు నిర్వహించిన నాగేశ్వర్‌గుప్తా కామారెడ్డి జిల్లాకు బదిలీ కావడంతో సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం నుంచి వెంకటలక్ష్మమ్మ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ తిరుపతిరెడ్డి నుంచి బాధ్యతలు తీసు కున్నారు. మండల ప్రజల సహకారంతో గ్రా మాల అభివృద్ధికి, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తానని ఆమె అన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ


రేషన్ కార్డు అందజేస్తున్న తహసీల్దార్ సహదేవ్, సింధూజ

చిలప్‌చెడ్(నర్సాపూర్): అర్హులైన లబ్ధిదారులకు శనివారం తహసిల్ కార్యాలయంలో రేషన్ కార్డులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ సహదేవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలప్‌చెడ్ మండలానికి 93 నూతన రేషన్ కార్డులు వచ్చాయన్నారు. చిలప్‌చెడ్ గ్రామానికి 12 రేషన్ కార్డులు రాగా వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశామన్నారు. కొత్తగా రేషన్‌కార్డులు పొందాలనుకునే వారు ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సింధూజ ఉన్నారు.

వీధికుక్కలను అరికట్టాలి


ఆర్థిక సాయం చేస్తున్న మహేశ్‌గుప్తా, రమాకాంత్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): గ్రామాల్లో వీధి కుక్కలు వీర విహారం చేస్తున్నాయని వాటిని అదుపు చేయాలని మాజీ జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ రమాకాంత్‌రెడ్డిలు అన్నారు. రూప్ల తండాలో కుక్కల దాడిలో మృతిచెందిన బాలుడు నితిన్ మృతదేహన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.15 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బాలుడు నితిన్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ బుచ్చనాయక్, తండా వాసులు కిషన్, రూప్ల, తదితరులు ఉన్నారు.

నీరుడి రవికి డాక్టరేట్

కౌడిపల్లి(నర్సాపూర్): అతనిది నిరుపేద కుటుంబం, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదివి గత ఏడాది ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించారు. చదువుపై ఉన్న శ్రద్ధతో ప్రస్తుతం ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి కామర్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ సాధించాడు. గత ఏడాది ఎంజేపీ డిగ్రీ గురుకుల లెక్చరర్‌గా ఉద్యోగం రావడంతో మెదక్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఓయూ రిజిస్ట్రార్, డిపార్ట్ మెంట్‌ఆఫ్ కామర్స్ ప్రొఫెసర్ డాక్టర్ గడ్డం నరేష్‌రెడ్డి పర్యవేక్షణలో ×ఎస్టడీ ఆన్‌ది ఇంపాక్ట్ ఆఫ్ కార్పొరేట్ గవర్నెన్స్ ఆఫ్ బీఎస్ఈ సెన్సెక్స్ కంపెనీస్‌ ' అంశంపై పీహెచ్‌డీ పూర్తిచేయడంతో డాక్టరేట్ వచ్చినట్లు రవి తెలిపారు. అతడి గ్రామస్తులు, అభినందించారు.

ఆలయంలో చోరీకి యత్నం

వెల్దుర్తి(తూప్రాన్) : మండల కేంద్రం వెల్దుర్తిలోని శ్రీ రేణుకాఎల్లమ్మ దేవాలయంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి యత్నించారు. ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగలగొట్టిన దుండగుడు గర్భగుడిలోని చెక్క అల్మారాలో పూజారి దాచిన నగదు అపహరించాడు. శనివారం ఉదయం ఆలయంలో పూజలు నిర్వహించడానికి వచ్చిన పూజారి గుడి తలుపులు ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆయిల్ పామ్‌తో అధిక లాభాలు

ఏఓ ఝాన్సి

వెల్దుర్తి(తూప్రాన్): ఆయిల్‌పామ్ సాగులో అధిక లాభాలు పొందవచ్చని ఏఓ ఝాన్సి సూచించారు. మండలంలోని దామరంచ గ్రామంలో ఓ రైతు పొలంలో ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ శనివారం ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయిల్‌పామ్ సాగుకు 32 మంది రైతులు ముందుకు వచ్చారని, సుమారు 50 ఎకరాలకుపైగా భూమిని గుర్తించామని చెప్పారు. రైతులకు ప్రణాళికా బద్ధంగా ప్లాంటేషన్ చేస్తారని తెలిపారు. అంతర పంటలు కూడా సాగు చేసుకుని అదనపు ఆదాయం పొందవచ్చని సూచించారు. బై బ్యాక్ పద్ధతిలో మొక్కలు సరఫరా చేసిన కంపెనీలే ఉత్పత్తిని కొనుగోలు చేస్తాయని, తద్వారా ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని చెప్పారు.


ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న ఏఓ ఝాన్సి

సాంకేతికతతో విద్య ప్రమాణాలు మెరుగు


విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ విఠల్

మండల విద్యాధికారి విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఏఐతో ప్రభుత్వ పాఠశాలలో విద్యా ప్రమాణాలు మెరుగవుతున్నాయని చిలప్‌చెడ్ మండల విద్యాధికారి విఠల్ అన్నారు. శనివారం మండల పరిధిలోని గౌతాపూర్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలతో పాటు, గౌతాపూర్ తండా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, విద్యార్థుల పఠన నైపుణ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. నూతన బోధన పద్ధతులను ఉపయోగించి, విద్యార్థులకు సులభ పద్ధతిలో అర్థమయ్యేలా బోధించాలన్నారు. విద్యార్థుల ప్రగతిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కృష్ణ, వాణి పాల్గొన్నారు.

కేజీబీవీలో నీటి సమస్య పరిష్కారం

రామాయంపేట(మెదక్): కేజీబీవీ విద్యాలయంలో నెలకొన్న నీటి ఎద్దడి సమస్యను పరిశీలించిన భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం, ఇతర అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించారు. గ్రిడ్‌లో మరమ్మతులతో మూడు రోజులపాటు నీటి సరఫరాకు ఆటంకం కలిగిందని, దీంతో స్కూలు విద్యార్థినులు ఇబ్బందులపాలయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న భగీరథ కనెక్షన్‌కు తోడు అదనంగా మరో కనెక్షన్ ఇప్పించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. భవిష్యత్తులో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా భవనం పైభాగంలో ఉన్న వాటర్ ట్యాంకులోని నీరు ఎక్కించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.


నీటి సరఫరాను పునరుద్ధరిస్తున్న అధికారులు

నారు కొనలను తుంచి నాటు వేయాలి


రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ స్వప్న

ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): కాండం తొలుచు పురుగు నివారణకు రైతులు వరినాట్లు వేసేటప్పుడు నారు కొనలను తుంచి వేయాలని ఏఓ స్వప్న సూచించారు. శనివారం మండలంలోని దేవులపల్లితండాలో క్షేత్రస్థాయిలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నారు కొనలలో కాండం తొలుచు పురుగుల గుడ్లు ఉంటాయని చెప్పారు. పురుగు ఉధృతిని తగ్గించేందుకు నారు కొనలను తుంచివేసినట్లు వేసుకోవాలన్నారు. తుంచిన కొనలను వదిలేయకుండా భూమిలో తొక్కిపెట్టాలని చెప్పారు. నాటువేసిన వారం రోజుల్లో ఎకరాకు 800గ్రాముల త్రీజీ లేదా ఫోర్‌జీ గుళికలు వేసుకోవాలని చెప్పారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

కౌడిపల్లి(నర్సాపూర్): విద్యతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం లభిస్తుందని జిల్లా ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ నాయకుడు కొడ శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. శనివారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 2024-25లో పదవ తరగతిలో 500మార్కులకు పైగా సాధించిన పది మంది విద్యార్థులను సిల్వర్ మెడల్స్, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే మనం ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానానికి ఎదుగుతామన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల హెచ్‌ఎంలు సాజిద్‌అలీ, పద్మజ, రిటైర్డ్ ఉపాధ్యాయులు మోహన్‌రెడ్డి, పుండరీకంగౌడ్, నాయకులు దుర్గాగౌడ్, శాఖయ్య, మల్లేశం, సత్యనారాయణగౌడ్, మక్బుల్, నాసర్‌ఖాన్, లక్ష్మన్, చంద్రం, సంజీవ్, వెంకటేశం, జగన్, ఎస్ఎంసీ చైర్మన్‌లు రాధిక, పూర్ణిమ విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులను సన్మానించిన నాయకులు

వ్యక్తి అదృశ్యం


నాగయ్య

నర్సాపూర్ రూరల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన నర్సాపూర్‌లో వెలుగు చూసింది. ఎస్సై లింగం వివరాలు ప్రకారం... కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పానుగంటి రాములు (50) ప్రస్తుత నర్సాపూర్‌లో నివాసముంటున్నాడు. కొన్ని రోజులుగా భార్య పోచమ్మతో గొడవలు జరుగుతున్నాయి. శుక్రవారం నాగయ్య కూరగాయలు తీసుకువస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో భార్య పోచమ్మ నాగయ్యకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. చుట్టుపక్కలతో పాటు బంధువుల వద్ద వెతికినా నాగయ్య ఆచూకీ తెలియరాలేదు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్

చేగుంట(తూప్రాన్): మాసాయిపేట మండలంలోని పలు పాఠశాలలను అదనపు కలెక్టర్ నగేశ్ శనివారం సందర్శించారు. చెట్లతిమ్మాయిపల్లి, పోతాన్‌పల్లి గ్రామాల్లోని పాఠశాలలను సందర్శించి పాఠశాలల పరిస్థితులను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు.

నార్సింగి ఎస్సైగా సృజన

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి నూతన ఎస్సైగా సృజన శనివారం బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నార్సింగి ఎస్ఐగా పనిచేసిన అహ్మద్ మొయినుద్దీన్ మెదక్ ఎస్పీ కార్యాలయ వీఆర్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే.